క్లుప్తంగా

పాలిసెట్ ప్రవేశ పరీక్షకు ఉచిత శిక్షణ

ఆమదాలవలస రూరల్: దన్నానపేట గ్రామం సమీపంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో పాలిసెట్ ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎ.గోపి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వచ్చే నెల ఒకటి నుంచి 24వ తేదీ వరకు ఉచిత శిక్షణతో పాటు స్టడీ మెటీరియల్ ఉచితంగా అందజేస్తామన్నారు. శిక్షణ అనంతరం నమూన పరీక్ష నిర్వహిస్తామని చెప్పారు. పాలిసెట్ ప్రవేశ పరీక్ష రాసేందుకు ఏప్రిల్ ఐదో తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆసక్తి గల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాల కోసం 96662 09696 నంబర్‌ను సంప్రదించాలి.

ముమ్మరంగా వాహనాల తనిఖీ



సత్యవరం కూడలి వద్ద కారును తనిఖీ చేస్తున్న దృశ్యం

నరసన్నపేట: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలీసులు వాహనాలను ముమ్మరంగా తనిఖీ చేస్తున్నారు. స్థానిక డీటీ గాయిత్రి ఆధ్వర్యంలో స్క్వాడ్ బృందం కార్లు, ద్విచక్ర వాహనాలు, ప్రైవేటు బస్సులను శుక్రవారం తనిఖీ చేశారు. జమ్ము కూడలి, సత్యవరం జంక్షన్, మడపాం టోల్‌గేట్‌ల వద్ద తనిఖీలు చేపట్టారు.

గ్రామాల్లో వైద్య సిబ్బంది పర్యటన

సరుబుజ్జిలి: వేసవి తీవ్రతతో జ్వరాలు ప్రభావం అధికంగా ఉంటాయని సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి సంతోష్ కుమార్ అన్నారు. పెదమాలపేట, యరగాం గ్రామాల్లో శుక్రవారం పర్యటించారు. సిబ్బంది ప్రతీ రోజు ఇంటింటి సర్వేలు చేయడం ద్వారా ప్రజల ఆరోగ్యస్థితిగతులు తెలుసుకోవచ్చునన్నారు. కలుషితనీరు, ఆరుబయట తినుబండారాలు, విందుభోజనాలకు దూరంగా ఉండే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

నేడు రెండు గ్రామాల్లో కృష్ణదాస్ ప్రచారం

సారవకోట: మండలంలోని కేశవలస, సత్రాం పంచాయతీల్లో వైఎస్సార్‌సీపీ నరసన్నపేట ఎమ్మెల్యే అభ్యర్థి ధర్మాన కృష్ణదాస్ శనివారం ప్రచారం చేస్తారు. ఈ విషయాన్ని పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు వరుదు వంశీకృష్ణ శుక్రవారం తెలిపారు. పార్టీ కార్యకర్తలు, నాయకులు హాజరు కావాలని కోరారు.

నేడు మండల సమావేశం

పాతపట్నం: మండల ప్రజా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశాన్ని శనివారం ఉదయం 10.30 గంటలకు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో కె.రామకృష్ణరాజు శుక్రవారం తెలిపారు. ఎంపీపీ దోర సావిత్రమ్మ అధ్యక్షతన జరగనున్న సమావేశానికి మండల అధికారులు పూర్తి సమాచారంతో హాజరు కావాలని, సభ్యులంతా విధిగా హాజరు కావాలని కోరారు.

బాలా త్రిపుర సుందరీదేవికి అభిషేకాలు

శ్రీకాకుళం కల్చరల్: బలగలోని బాలా త్రిపుర కాలభైరవ పీఠం దేవాలయంలో శుక్రవారం అమ్మవారికి ప్రత్యేకంగా అభిషేకాలు చేశారు. పీఠం నిర్వాహకులు గణేష్ గురూజీ నేతృత్వంలో అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించి అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ సైనికుడి సేవా స్ఫూర్తి



రక్తదానం చేస్తున్న పవన్‌కుమార్

శ్రీకాకుళం కల్చరల్: రెడ్‌క్రాస్ సైనికుడిగా సేవలు అందిచండంతో పాటు అత్యవసర పరిస్థితుల్లో ఎస్‌డీపీ రక్తదానం చేసి ఓ తల్లి ప్రాణాలు కాపాడి సేవా స్ఫూర్తికి నిదర్శనంగా నిలిచిన గడిశెట్టి పవన్‌కుమార్ సేవలు అభినందనీయమని రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు అన్నారు. నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో ఆర్.సత్యవతికి అత్యవసర పరిస్థితుల్లో ఏ–పాజిటివ్ ఎస్‌డీపీ రక్తం అవసరమైందని, ఎమర్జెన్సీ బ్లడ్ సర్వీస్ గ్రూప్ ద్వారా సమాచారం తెలుసుకుని హేమసుందర్‌తో పాటు పవన్‌కుమార్‌లు రక్తదానం చేశారు.

రైతులకు విత్తనాల పంపిణీ

శ్రీకాకుళం రూరల్: మండలంలోని ఖాజీపేట, అరసవల్లి గ్రామాల్లో డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం రైతులకు వేసవి పంట విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ఏరియా మేనేజర్ పి.తవిటినాయుడు మాట్లాడుతూ రబీ సీజన్‌లో మొక్కజొన్న పంట అనంతరం పొలాలను ఖాళీగా ఉంచకుండా వేసవి పంటలు వేయడం ద్వారా భూగర్భ జలాలు ఆవిరి కాకుండా కాపాడుకోవచ్చన్నారు. వేసవి దుక్కుల పేరిట నేలను పలుమార్లు దున్నడం వల్ల నేలలోని తేమ ఆవిరైపోవడమే కాకుండా ఉపయోగకర సూక్ష్మ జీవులు కనుమరుగు కాకుండా ఉంటాయన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ సమన్వయకర్త అప్పలసూర్యనారాయణ, అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.

అన్నదాతకు ఆత్మీయ నేస్తాలు

అప్పుడు..

చంద్రబాబు పాలనలో వ్యవసాయం దండగ అన్నారు. సాగుకు శాశ్వత విరామం ప్రకటించాలని రైతులకు పిలుపునిచ్చారు. పంటలు వదిలి ప్రత్యామ్నాయం వైపు రైతులు చూడాలన్నారు. విత్తనాలు, ఎరువులు సరఫరాలో రైతులకు చుక్కలు చూపించారు. పంట దిగుబడులు అమ్ముకునేందుకు రైతులు అనేక ఇబ్బందులు పడ్డారు. ఒక్క మాటలో చెప్పాలంటే రైతులపై చంద్రబాబు ప్రభుత్వం చులకన భావం చూపించింది.

ఇప్పుడు..

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టిన తరువాత సాగు పద్ధతుల్లో అనేక మార్పులు తీసుకువచ్చారు. రైతున్నకు వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం కొండంత అండగా నిలిచింది. పంట పండించాలన్న కోరిక రైతుల్లో బలంగా పెరిగింది. రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి రైతుల ఇంటి వద్దకు ఎరువులు, విత్తనాలతో పాటు ప్రభుత్వ సేవలను అందిస్తూ రైతులను ప్రోత్సహిస్తున్నారు. పంట పెట్టుబడి సాయం రైతుకు ఆర్థికంగా ఆదుకుంటుంది.



టి.కె.పురం రైతు భరోసా కేంద్రం



తురకపేట ఆర్బీకే వద్ద కియోస్క్‌లో రైతు వివరాలు నమోదు చేస్తున్న దృశ్యం



ఆర్బీకే వద్ద ఎరువులు సరఫరా చేస్తున్న వ్యవసాయ శాఖ సిబ్బంది

- ఆర్‌బీకేలతో మెరుగైన సేవలు
- పంట సాగు సమయంలో సూచనలు, సలహాలు
- పంటల బీమా, ఈ–క్రాప్ నమోదు అక్కడే

ఎల్.ఎన్.పేట: రైతు భరోసా కేంద్రాలు అన్నదాతకు ఆత్మీయ నేస్తాలుగా మారాయి. విత్తనాలు వేసుకున్నప్పటి నుంచి పంట దిగుబడులు కొనేంత వరకు ప్రభుత్వం రైతులపై ఎంతో బాధ్యతగా వ్యవహరిస్తోంది. రైతు భరోసా కేంద్రాల ద్వారా విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ సాగు పరికరాలు సరఫరా చేస్తుంది. విత్తనాలు, ఎరువుల కోసం రైతులు పడిగాపులు పడాల్సిన దుస్థితి తప్పింది. ప్రతీ ఏడాది ఆర్బీకేల ద్వారానే ఎరువులు, విత్తనాలు సకాలంలో సరఫరా చేస్తుంది. రైతు సంక్షేమానికి ఎంతో ప్రాధాన్యత ఇచ్చారు. రైతు భరోసా కేంద్రాలు, గ్రామ సచివాలయ వ్యవసాయ సహాయకులు రైతులకు నేస్తాలుగా మారారు. సాగు ప్రారంభానికి ముందు నుంచే సలహాలు ఇస్తూ రైతులకు అవగాహన కలిగిస్తున్నారు. గతం కంటే సాగు విస్తీర్ణంతో పాటు పంట దిగుబడులు పెరిగాయి.

ఎల్.ఎన్.పేట మండలంలో వివరాలు ఇలా..	
గ్రామ పంచాయతీలు	23
రైతు భరోసా కేంద్రాలు	12
భవన నిర్మాణం పూర్తయినవి	12
ఒక్కో భవనానికి కేటాయించిన నిధులు	రూ.23.94 లక్షలు
మండలంలో రెవెన్యూ గ్రామాలు	47
మండలంలో సాగు విస్తీర్ణం	12,850 ఎకరాలు

నాలుగేళ్లలో విత్తనాలు, ఎరువులు పంపిణీ ఇలా..

నాలుగేళ్లలో సుమారు 3,160 క్వింటాళ్ల విత్తనాలు రైతు భరోసా కేంద్రాల ద్వారా సరఫరా చేశారు. అలాగే యూరియా 2,400 మెట్రిక్ టన్నులు, డీఏపీ 1,140 మెట్రిక్ టన్నులు రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు అందించారు.

ఆర్బీకేలు అండగా ఉన్నాయి



జగనన్న రాక ముందు విత్తనాలు, ఎరువుల కోసం మండల కేంద్రానికి వెళ్లి రోజంతా కాపలా కాసేవాడిని. ఉదయం నుంచి సాయంత్రం వరకు లైన్లో ఉండి తోపులాటలు జరిగితే రెండు బస్తాలు విత్తనాలు ఇచ్చేవారు. ఎరువులదీ ఆదే పరిస్థితి. రైతు భరోసా కేంద్రాలు వచ్చిన తరువాత విత్తనాలు, ఎరువుల కోసం కష్టాలు తప్పాయి. ఉన్న ఊర్లోనే అన్ని సమకూరుతున్నాయి. ఆధార్ కార్డు, పట్టాదారు పాస్ పుస్తకం తీసుకుని వెళితే ఆర్బీకేల్లోనే ఇస్తున్నారు.

– పల్లి అప్పలనాయుడు, రైతు, దబ్బపాడు, ఎల్.ఎన్.పేట

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక



పార్టీలో చేరిన వారితో స్పీకర్ తమ్మినేని సీతారాం, చిరంజీవినాగ్

ఆమదాలవలస: సరుబుజ్జిలి మండలం మూల సవలాపురం గ్రామానికి చెందిన 15 కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో శుక్రవారం చేరాయి. ఆమదాలవలసలోని స్పీకర్ క్యాంపు కార్యాలయం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీలో చేరిన వారికి స్పీకర్ తమ్మినేని సీతారాం సమక్షంలో పార్టీ రాష్ట్ర యువజన విభాగ ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్ కండువాలు వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు జి.రమణమూర్తి, చిరుపల్లి శ్రీనివాసరావు, కర్రి గణేష్, పి.తవిటినాయుడు, సరుబుజ్జిలి జెడ్పీటీసీ సభ్యుడు సురవరపు నాగేశ్వరరావు, పార్టీ మండల అధ్యక్షుడు బెవర మల్లేశ్వరరావు, మూడడ్ల రమణ, అత్తులూరి రవికాంత్ ఉన్నారు.

సీఎం జగన్ విజయం ఖాయం



మద్దతు కోరుతున్న పార్టీ నాయకులు

కొత్తూరు: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండోసారి ముఖ్యమంత్రిగా విజయం సాధించడం ఖాయమని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి బూర్లె శ్రీనివాసరావు, గ్రామ సచివాలయం మండల కన్వీనర్ గండివలస ఆనందరావు అన్నారు. కర్లెమ్మ ఆర్‌ఆర్ కాలనీ సర్పంచ్ సుచ్చ అప్పారావు, కంతమానుగూడలో ఎంపీపీ సవర సావిత్రిలను పార్టీ నాయకులు శుక్రవారం కలిసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని కోరారు. ఎమ్మెల్యే రెడ్డి శాంతితో కలిసి పనిచేయాలని విజ్ఞప్తి చేశారు. పార్టీ జిల్లా ప్రచార కార్యదర్శి పంకజదాస్, సర్పంచ్ సేపాన అశోక్ కుమార్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు అగతమూడి నాగేశ్వరరావు ఉన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి



నరసన్నపేట:అంబోజీపేటలో ర్యాలీ చేస్తున్న దృశ్యం



ఆమదాలవలస రూరల్: ర్యాలీ చేస్తున్న వెలుగు సిబ్బంది



హిరమండలంలో అవగాహన కల్పిస్తున్న డీటీ ప్రవీణ్‌కుమార్



పాతపట్నం: చంగుడి గ్రామంలో మానవహారం చేస్తున్న మహిళలు

నరసన్నపేట: ప్రతిఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని నరసన్నపేట ఆర్‌ఐ లోకేష్ అన్నారు అంబోజీపేటలో ఓటు హక్కు వినియోగంపై శుక్రవారంఅవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకొని పోలింగ్ శాతాన్ని పెంచాలన్నారు. అలాగే ఏప్రిల్ ఒకటో తేదీ నాటికి 18 సంవత్సరాలు నిండిన వారు కొత్తగా ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నూరళ్లఖాన్ పాల్గొన్నారు.

ఆమదాలవలస రూరల్: విలువైన ఓటు హక్కును ప్రతీ ఒక్కరూ వినియోగించుకోవాలని ఏపీఎం పైడి కూర్మారావు అన్నారు. స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయం నుంచి పట్టణంలో ఓటు వినియోగంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రలోభాలకు లోనుకాకుండా ఓటును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని సూచించారు. మండల సమాఖ్య అధ్యక్షురాలు తమ్మినేని ధనలక్ష్మి, వెలుగు సిబ్బంది కల్యాణి, సుభద్ర, చంద్రరావు, రమణ, జగదీష్, వీవోఏలు పాల్గొన్నారు.

పాతపట్నం: ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఏపీఎం ఎం.మనోరత్నం అన్నారు. చంగుడి గ్రామంలో స్వీప్ ఆధ్వర్యంలో ఓటు హక్కు వినియోగంపై అవగాహన ర్యాలీని నిర్వహించారు. డ్వాక్రా మహిళలతో కలిసి గ్రామంలో ర్యాలీ నిర్వహించి, మానవహారం చేసి ప్రతిజ్ఞ చేశారు. పంచాయతీ కార్యదర్శులు, వీర్వోలు, సచివాలయ ఉద్యోగులు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

హిరమండలం: మేజర్ పంచాయతీ హిరమండలంలోని పోలింగ్ బూత్ 305 నుంచి 309 పోలింగ్ బూత్‌ల పరిధిలో మండల ఉప తహసీల్దార్ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. ఎన్నికలు–ఓటరు ప్రాధాన్యత అంశంపై వివరించారు. ఓటు నమోదు, ఓటుహక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. రెవెన్యూ, సచివాలయ సిబ్బంది పాల్గున్నారు.

భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే ప్రార్థనలు



పాతపట్నంలో ఏసు శిలువతో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఆమదాలవలస: గుడ్‌ఫ్రైడే సందర్భంగా చర్చిలు, క్రైస్తవ ప్రార్థన మందిరాల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. ఈ సందర్భంగా హౌస్ ఆఫ్ ప్రేయర్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో రెవరెండ్ పాస్టర్ జి.శామ్యూల్ అరుణ్ కుమార్ సందేశాన్ని వినిపించారు. గుడ్‌ఫ్రైడే విశిష్టతను తెలియజేశారు. పాస్టర్లు సామ్సన్, అహరోన్ రాజు, సామ్య, గంట జోర్నో, బాల లక్ష్మి పాల్గొన్నారు. మెట్టక్కివలస చర్చిలో పాస్టర్ రాడ విజయ్‌కుమార్ ప్రార్థనలు చేశారు.

పాతపట్నం: ఏసు క్రీస్తు శిలువ వేసి మరణించిన గుర్తుగా గుడ్‌ఫ్రైడేను జరుపుకుంటారని పాతపట్నం పాస్టర్స్ జి.ప్రసాద్, డి.విజయ్ కుమార్ అన్నారు. పాతపట్నం మండల కేంద్రాలతో పాటు మండలంలోని వివిధ గ్రామలలో ఉన్న చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పాతపట్నం ప్రధాన రహదారిపై కల్లాట చర్చి ఆధ్వర్యంలో ఏసు శిలువతో కూడిన బృందం ర్యాలీ నిర్వహించారు. పాతపట్నం ఆర్‌సీఎం చర్చి, జేసీపీ అండ్ ఈఎం చర్చి, కల్వరీ గస్పెల్‌చర్చి, డబ్ల్యూఈఈ చర్చితో పాటు కొరసవాడలో ఆంధ్రా బాపిస్టు చర్చి, తెంబూరు, రొంపివలస, తామర, తీమర, పాశీగంగుపేట, ఆర్.ఎల్.పురంలో ప్రార్థనలు జరిగాయి.

ఎల్.ఎన్.పేట: పెద్దకొల్లివలస గ్రామంలోని చర్చిలో ఎల్.ఎన్.పేట మండల పాస్టర్స్ ఫెల్లోషిప్ పాస్టర్ ఎస్. రాజు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ప్రతి ఒక్కరూ ప్రభువైన ఏసు మార్గంలో నడవాలని బోధనలు చేశారు. సిద్ధాంతం, కొత్తబాలేరు, వాడవలస, ఎల్.ఎన్.పేట, యంబరాం రోడ్డు, కోవిలాం, బొత్తాడసింగి, కరకవలస, కొత్త జోగివలస, కవిటి, తురకపేట సెంటర్ తదితర గ్రామాల్లోని చర్చిల్లో ప్రార్థనలు చేశారు.



ఆమదాలవలస: ప్రార్థనలు చేస్తున్న దృశ్యం



ఆమదాలవలస: మెట్టక్కివలసలో ప్రార్థనలు చేస్తున్న దృశ్యం



ఎల్.ఎన్.పేట: పెద్దకొల్లివలస చర్చిలో ప్రార్థనలు చేస్తున్న పాస్టర్ రాజు

‘ఫ్యాన్’ ప్రభంజనం సృష్టించాలి

- ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు



పోలాకి: అక్కువరంలో ప్రచారం చేస్తున్న ధర్మాన పద్మప్రియ

నరసన్నపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఐదేళ్ల పాలనలో జరిగిన అభివృద్ధిని చూసి మే 13వ తేదీన జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ప్రభంజనం సృష్టించాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఓటర్లను అభ్యర్థించారు. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందించిన ముఖ్యమంత్రి జగన్ పాలనకు మద్దతు తెలపాలని కోరారు. నరసన్నపేట, ఆమదాలవలస, పాతపట్నం నియోజకవర్గాల్లోని పలు గ్రామాల్లో పార్టీ నాయకులు శుక్రవారం ఎన్నికల ప్రచారం చేపట్టారు. నరసన్నపేట మండలం తామరాపల్లి, జమ్ము సచివాలయాల పరిధిలో పార్టీ సీఈసీ సభ్యురాలు ధర్మాన పద్మప్రియ, పోలాకి జెడ్పీటీసీ సభ్యుడు ధర్మాన కృష్ణచైతన్య ప్రచారం నిర్వహించారు. టీడీపీ కూటమి మాయ మాటలను ప్రజలు నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు. ఈ రెండు సచివాలయాలను గడిచిన 58 నెలల్లో ఎంతగానో అభివృద్ధి చేశామన్నారు. మంచి ప్రభుత్వాన్ని దీవించాలని, ఫ్యాను గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా ధర్మాన కృష్ణదాస్, ఎంపీగా పేరాడ తిలక్‌ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ పెద్ద కుమారుడు రామలింగన్నాయుడు కూడా ప్రచారంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఆరంగి మురళి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చింతు రామారావు, జమ్ము, తామరాపల్లి సర్పంచ్‌లు వాన గోవిందరావు, ముచ్చ కరుణ, నాయకుడు కోల గణేష్ పాల్గొన్నారు.

పోలాకి: కొత్తరేవు సచివాలయం పరిధి జోగంపేట, కొత్తరేవు, కావిరిపేట, అక్కువరం, కంబాలవానిపేట, పరపతివానిపేట గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ బీసీసెల్ జోనల్ ఇన్‌చార్జి, జెడ్పీటీసీ సభ్యుడు ధర్మాన కృష్ణచైతన్య ప్రచారం చేశారు. సంక్షేమ ప్రభుత్వానికి మరోసారి పట్టం కట్టాలని ఓటర్లను అభ్యర్థించారు. తీరప్రాంతంలో అనేక ఏళ్లుగా టీడీపీకి మద్దతు పలికినప్పుడు జరగని అభివృద్ధి జగన్ హయాంలో జరిగిందని స్థానిక యువత, మత్స్యకారసంఘ నాయకులు, మహిళలు అన్నారు. వైఎస్సార్‌సీపీ సీఈసీ సభ్యురాలు ధర్మాన పద్మప్రియ మాట్లాడుతూ.. మహిళల పక్షపాతిగా నిలిచిన జగన్‌కు ఈసారి అక్కచెల్లెమ్మలంతా అండగా నిలవాలని కోరారు. ప్రచారంలో కృష్ణదాస్ తనయులు కృష్ణచైతన్య, రామలింగంనాయుడులు చురుగ్గా పాల్గొని పార్టీశ్రేణులకు ఉత్సాహాన్నిచ్చారు. డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, మండలపరిషత్ సలహాదారు ముద్దాడ భైరాగినాయుడు, ఏఎంసీ చైర్మన్ దుంపల భాస్కరరావు, వైస్ ఎంపీపీలు కోట అప్పారావు, కలగదండు తాతారావు, మండల పార్టీ అధ్యక్షుడు కణితి కృష్ణారావు, నాయకులు అడ్ల శ్రీను, మిత్తన శ్రీనివాస్‌రెడ్డి, మురబంద యర్రయ్య, బచ్చు ఆదినారయణరెడ్డి, చింతాడ భీమారావు, ఆబోతు మల్లేసు ఉన్నారు.

హిరమండలం: సీఎం వైఎస్ జగన్‌హన్‌రెడ్డితోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు, ఎమ్మెల్యే రెడ్డి శాంతి తనయుడు ఓంశ్రీకష్ణ అన్నారు. కిట్టలపాడు గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించి ఓట్లను అభ్యర్థించారు. ఎమ్మెల్యేగా రెడ్డి శాంతిని, ఎంపీగా పేరాడ తిలక్‌ను ఫ్యాన్ గుర్తుపై ఓటువేసి గెలిపించాలని కోరారు. మండల పార్టీ అధ్యక్షుడు మీసాల వెంకట రామకృష్ణ, పీఏసీఎస్ అధ్యక్షుడు ఏవీ సురేష్, నాయకులు ఎల్.శ్రీనివాసరావు,ప్రసాద్, వి.చిన్నారావు, గొర్ల నాగేశ్వరరావు, శిమ్మ పాపయ్య, బి.మురళీ ఉన్నారు.



పాతపట్నంలో ప్రచారం చేస్తున్న రెడ్డి శ్రావణ్‌కుమార్

పాతపట్నం: ఎమ్మెల్యే రెడ్డి శాంతి తనయుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు రెడ్డి శ్రావణ్ కుమార్ పాతపట్నం ప్రధాన రహదారిలో మార్నింగ్ వాక్‌కు వెళ్లి ప్రచారం నిర్వహించారు. పేదల సంక్షేమమే తమ ప్రభుత్వ ధ్యేయమన్నారు. పార్టీ అభ్యర్థులను గెలిపించాలని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఎస్.ప్రదీప్, సచివాలయ మండల కన్వీనర్ వై.సూర్యం, కార్యదర్శి జి.రాము, నాయకులు పనుకు మోహన్, కృష్ణారావు, నేతాజీ, రాజు ఉన్నారు.



నరసన్నపేట: తామరాపల్లిలో ప్రచారం చేస్తున్న పోలాకి జెడ్పీటీసీ సభ్యుడు ధర్మాన కృష్ణచైతన్య



నరసన్నపేట: జమ్ములో ఫ్యాను గుర్తుపై ఓటు వేయాలని వృద్ధురాలిని కోరుతున్న రామలింగన్నాయుడు



పోలాకి: కొత్తరేవులో ప్రచారం చేస్తున్న కృష్ణచైతన్య, రామలింగన్నాయుడు